## జూన్ 8న మెగా లోక్ అదాలత్

**న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి**

సూర్యాపేట లీగల్, మే 18 : సూర్యాపేట కోర్టుల ఆవరణలో జూన్ 8న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సమష్టి కృషితో విజయవంతం చేయాలని న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మెగా లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు సిబ్బందితో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టుల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ పనైనా విజయవంతం కావాలంటే సమష్టి కృషి అవసరమన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది సమష్టిగా కృషి చేసి మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ, ప్రధాన ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కె.సురేశ్, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

## సభలు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలి

**• సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే**

సూర్యాపేట సిటీ, మే 18 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పకుండా ఎన్నికల నియమావళిని పాటించాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనల పరిధి దాటకుండా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందని.. ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రసంగాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఇతరుల ఇండ్ల గోడలపై రాతలు రాయడం, హోర్డింగులు ఏర్పాటు చేయడం వంటివి చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా పోస్టులు పెట్టరాదని పేర్కొన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దాసరి హరిచందన

## కౌంటింగ్ విధులు సక్రమంగా నిర్వహించాలి

**• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన**

నల్లగొండ, మే 18: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ విధులు బాధ్యతతో, జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన సిబ్బందికి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై శనివారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల పోలింగ్‌లో అధికారులు, సిబ్బంది బాగా పనిచేశారని, అదే ఉత్సాహంతో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. కౌంటింగ్ టేబుల్ వద్ద పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఆర్వో, ఏఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఎన్నికల నియమావళి కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు కౌంటింగ్ సెంటర్ లోకి ప్రవేశించిన సమయం నుంచి ముగిసే వరకు ఏయే స్టేజీల్లో ఎటువంటి పనులు చేయాలనే విషయమై ట్రైనర్ బాలు వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్(పులిచింతల) నటరాజన్, డీఆర్డీఓ నాగిరెడ్డి, నల్లగొండ, దేవరకొండ, హుజూర్‌నగర్, సూర్యాపేట, చండూరు ఆర్డీఓలు, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి శ్రవణ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి

**• మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు**


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, మే 18 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు తమ వార్డుల్లోని పట్టభద్రులను కలిసి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించాలన్నారు. ఈ నెల 21న పట్టణంలోని రామచంద్రగూడెం ఎస్వీ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమావేశానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి హాజరవుతారని, పట్టభద్రులంతా హాజరు కావాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పెండ్యాల పద్మ, కరీం, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల గల్లా ఖాళీ



## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లె ప్రగతికి నిధులు కట్

**కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం ఫండ్స్ కూడా ఇవ్వని సర్కార్**

**వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐలు, ఇతర ఖర్చులు భరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు**

**ఐదు నెలల్లో ఒక్కో కార్యదర్శి రూ.లక్షకు పైగా సొంతంగా ఖర్చు**

**కేసీఆర్ సర్కార్‌లో ప్రతి నెలా రూ.20 కోట్ల దాకా నిధులు విడుదల**




నల్లగొండ, మే 18 : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఐదు నెలలుగా నిధుల విడుదల లేకపోవడంతో గ్రామ పంచాయతీల గల్లా ఖాళీ అయ్యింది. గత ప్రభుత్వం పల్లె ప్రగతి పేరుతో ప్రతి నెలా ఇచ్చే నిధులకు కొత్త సర్కార్ కోత పెట్టడంతో పంచాయతీల పాలన కష్టతరంగా మారింది. పైగా పాలకవర్గాల కాలం తీరిపోవడంతో అత్యవసర ఖర్చులను పంచాయతీ కార్యదర్శుల జేబు నుంచి ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ క్రమంలో ఈ ఐదు నెలల్లో ఒక్కో కార్యదర్శి కనీసం రూ.లక్ష దాకా పెట్టినట్లు తెలుస్తుంది. 2019 సెప్టెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నెలా జిల్లా వ్యాప్తంగా ఉన్న 844 గ్రామ పంచాయతీలకు రూ.20 కోట్ల వరకు నిధులు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఎస్సీ కాంపోనెంట్ నిధులు మినహాయిస్తే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం ఫండ్స్‌తోపాటు స్టేట్ ఫైనాన్స్ కింద రాష్ట్రం ఇచ్చే నిధులు సైతం నిలుపుదల చేసింది. దీంతో పంచాయతీల పాలన కష్టతరంగా మారింది. ఈ ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐలు, మంచినీటికి బోర్ల ఫ్లెషింగ్‌తోపాటు ఇతర ఖర్చులు కార్యదర్శులే పెట్టాల్సి వస్తుంది.

### విడుదల కాని ప్రగతి నిధులు..

పల్లె సీమలను పట్టుగొమ్మలుగా మార్చాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం 2019 సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి మనిషికి రూ.187 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు స్టేట్ ఫైనాన్స్ కమిషన్, ఎస్సీ కాంపోనెంట్ కింద నిధులు ఇచ్చింది. జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఈ పథకాల కింద ప్రతి నెలా రూ.20 కోట్లు విడుదల చేసింది. 2019 సెప్టెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు 51 నెలల పాటు రూ.1,020 కోట్లను గత ప్రభుత్వం ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ చేసింది. ఆ డబ్బును ట్రాక్టర్ల ఈఎంఐలు, పంచాయతీ కార్మికుల వేతనాలు, నీటి సమస్య పరిష్కారం, ఇతర ఖర్చుల కోసం వినియోగించుకున్నట్లు సర్పంచులు అంటున్నారు.

### ఐదు నెలల్లో వచ్చింది రూ.రూ.9.48 కోట్లే..

15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు స్టేట్ ఫైనాన్స్ కమిషన్, ఎస్సీ కాంపోనెంట్ కింద పల్లె ప్రగతిలో భాగంగా ప్రభుత్వం ప్రతి నెలా రూ.20 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. రేవంత్ సర్కార్ ఆ నిధులకు కోత పెట్టింది. డిసెంబర్ 3న కొలువుదీరిన కాంగ్రెస్ సర్కార్ అదే నెల నుంచి పల్లె ప్రగతి నిధులు నిలిపివేసింది. ప్రతి నెలా రూ.20 కోట్ల చొప్పున ఈ ఐదు నెలల్లో రూ.100 కోట్లు ఇవ్వాల్సి ఉన్నది. కానీ.. అన్నింటికీ కోత పెట్టి ఎస్సీ కాంపోనెంట్ కింద ఈ ఏడాది జనవరిలో రూ.5.69 కోట్లు, మార్చిలో రూ.3.79 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నది.

### పన్నులపై మాత్రం సీరియస్‌గా దృష్టి...

గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం.. పన్నుల వసూలుపై మాత్రం సీరియస్‌గా దృష్టి పెట్టింది. నిబంధనలు కఠినతరం చేసి గ్రామాల కార్యదర్శులకు నోటీసులు ఇచ్చి పన్ను వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పన్నులు వసూలు కాని గ్రామాల్లో పాలన భారం కార్యదర్శులపై పడింది. కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ తాగునీటి అవసరాలు, ఇతర అత్యవసర ఖర్చుల కోసం కార్యదర్శులు తమ జేబు నుంచి పెట్టాల్సి వస్తుంది. ఆ డబ్బులు వస్తాయా.. రావా? అనే మీమాంసలో కార్యదర్శులు పడ్డారు.

### ఐదు నెలల్లో రూ.9.78 కోట్లు విడుదల

పల్లె ప్రగతి కింద గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల్లో రూ.9.48 కోట్లు విడుదల చేసింది. జనవరిలో రూ.5.69 కోట్లు, మార్చిలో రూ.3.79 కోట్లు ఎస్సీ కాంపోనెంట్ కింద నిధులు విడుదల చేసింది. గ్రామాల్లో ఆర్థిక అవసరాలు తీర్చడానికి పన్నుల వసూలు చేపట్టాం. ట్రాక్టర్ల ఈఎంఐలు, కార్మికుల వేతనాలు పంచాయతీ నిధుల నుంచే ఇవ్వడం జరుగుతుంది.

**- మురళి, జిల్లా పంచాయతీ అధికారి, నల్లగొండ**

### గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది



గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడంతోపాటు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గ్రామాల్లో చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన నిధులు గ్రామ పంచాయతీ కరెంట్ బిల్లులు చెల్లించడానికే సరిపోతుంది. ట్రాక్టర్లకు డీజిల్ పోయడానికి కూడా నిధులు లేని పరిస్థితి. గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబ పోషణ భారంగా మారింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడితే.. కాంగ్రెస్ పాలనలో అధ్వాన్న స్థితికి వెళ్తున్నాయి.

**- సుర్వి యాదయ్యగౌడ్, మాజీ సర్పంచ్, అల్లందేవి చెర్వు, సంస్థాన్ నారాయణపురం మండలం**


చందంపేట మండలం తేకులగడ్డ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

## పలు చోట్ల వర్షం

**ఈదురుగాలులకు నేలరాలిన మామిడి కాయలు**

**పిడుగుపాటుకు గురై 15 గొర్రెలు,4 మేకలు మృత్యువాత, ఇద్దరికి గాయాలు**

నల్లగొండ/ మిర్యాలగూడ/ వేములపల్లి/ చందంపేట/ మునగాల/ చిలుకూరు, మే 18 : జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు పలుచోట్ల వర్షం కురిసింది. కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా కట్టంగూర్ మండలంలో 65.5 మి.మీ. వర్షం పడగా.. మిర్యాలగూడలో 26.3, దామరచర్లలో 17.3, నార్కట్‌పల్లిలో 8.3, తిప్పర్తిలో 5.3, నల్లగొండలో 4.8, చందంపేట మండలంలో 4 మి.మీ. వర్షం కురిసింది. చందంపేట మండలంలో కుంటలు, పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. రోడ్లపై వరద పారింది. మునగాల మండల కేంద్రంలోని గణపవరం క్రాస్ రోడ్డుపై నీరు నిల్వడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలులకు చిలుకూరు మండలంలోని రామాపురంలో మామిడి కాయలు నేలరాలాయి. పిడుగుపాటుకు గురై మిర్యాలగూడ మండలం జేత్యాతండాలో 15 గొర్రె పొట్టేళ్లు మృత్యువాత పడ్డాయి. కాపరికి గాయాలయ్యాయి. వేములపల్లి మండలం ఆమనగల్లులో గొర్రెల కాపరి తీవ్ర గాయాల పాలయ్యాడు. కాగా, మండు వేసవిలో వానలు పడుతుండడంతో అంతటా చల్లటి వాతావరణం నెలకొన్నది. రైతులు మెట్ట పంటల కోసం దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకుంటున్నారు.


మిర్యాలగూడ మండలం జేత్యాతండాలో పిడుగుపడి మృతిచెందిన గొర్రెలు








